క్లుప్తంగా

నేడు పీజీ ప్రవేశపరీక్షలపై అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌టౌన్: సెంట్రల్ యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షలపై శుక్రవారం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.లక్ష్మీనరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రవేశ పరీక్ష విధానం, సిలబస్, దరఖాస్తు చేసే విధానం మొదలగు అంశాల గురించి విద్యార్థులకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో పాటు డిగ్రీ పూర్తి చేసిన వారికి అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్:7013607011పై సంప్రదించాలన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణ పద్మశాలి సేవా సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆవిష్కరించారు. గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని పద్మశాలి భవన్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పద్మశాలీల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. పద్మశాలి విద్యార్థుల వసతి గృహ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం పదాధికారులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌టౌన్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) నూతన క్యాలెండర్, డైరీని గురువారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

ఏటీఏ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ నాగరాజు, ఎంపీపీ డుబ్బుల నానయ్య చేతుల మీదుగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు నైతం ఆనంద్, మెస్రం పరమేశ్వర, విఘ్నేష్, నర్మద, సంధ్య, కళావతి, లక్ష్మీనారాయణ, రవీందర్, సంతోశ్, శంకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ ఉన్నత పాఠశాలలో గురువారం వార్షిక ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలతో కుస్తీ పడే విద్యార్థులు క్రీడల కోసం కూడా సమయం వెచ్చించాలని సూచించారు. దీంతో శారీరక దారుఢ్యం మెరుగు పడుతుందని తెలిపారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు అందజేసి బహుమతులు ప్రదానం చేశారు.

పిల్లలను బడికి పంపాలి



బడిబయట పిల్లల సర్వే చేస్తున్న సీఆర్పీలు

కౌటాల: బడీడు పిల్లలను బడికి పంపాలని సర్వే ప్రత్యేకాధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కన్నెపల్లి గ్రామంలో బడి బయట పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కన్నెపల్లి గ్రామంలో ఐదుగురు బడి బయట పిల్లలను గుర్తించినట్లు పేర్కొన్నారు. సీఆర్పీలు దేవన్న, లాలాజీ ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: మండల కేంద్రానికి చెందిన రాథోడ్ కృష్ణ ఇటీవల తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీసులు గుర్తించి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడికి అప్పగించారు. ఎస్సై ఎస్. మధుకర్ మాట్లాడుతూ ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

సిద్ధమవుతున్న నర్సరీలు!

- హరితహారం కోసం మొక్కలు పెంపే లక్ష్యం
- ముమ్మరంగా కొనసాగుతున్న పనులు



వాంకిడి: మట్టి నింపుతున్న కూలీలు



కెరమెరి: కవర్లలో మట్టి నింపుతున్న కూలీలు

వాంకిడి/కెరమెరి: హరితహారం కార్యక్రమానికి అవసరమైన మొక్కలు పెంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీలు సిద్ధం చేస్తున్నారు. వానాకాలానికి మొక్కలు సిద్ధం చేయాలనే లక్ష్యంతో అధికారులు నర్సరీలో జరిగే పనులను పర్యవేక్షిస్తున్నారు. వేసవి కాలంలో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు నీటి వసతి ఉన్న ప్రదేశాలలో నర్సరీలు ఏర్పాటు చేసి రక్షణగా కంచెలు ఏర్పాటు చేస్తున్నారు.

కెరమెరి మండలంలో..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 31 నర్సరీలు ఏర్పాటు చేశారు. ఆయా నర్సరీల్లో 3లక్షల50 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. కెరమెరి, ఆగర్‌వాడలో గ్రామ పంచాయతీల్లో 20 వేలు, జోడేఘాట్‌లో 30 వేలు, మిగితా 28 పంచాయతీల్లో 10వేల చొప్పున మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. బ్యాగ్ ఫిల్లింగ్, నారు మళ్ల తయారీ పనులు జరుగుతున్నాయి. మండలంలో 40 శాతం మొక్కలను ఎవెన్యూ ప్లాంటేషన్ (రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడం), 10 శాతం పూల మొక్కలు, 30 శాతం టేకు మొక్కలు, 10 శాతం పండ్ల మొక్కలు, 10 శాతం ప్రోటాన్, మరో 10 శాతం ఇతర మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాంకిడి మండలంలో..

వాంకిడి మండలంలోని మొత్తం 28 గ్రామ పంచాయతీలలో 3.5 లక్షల మొక్కలు పెంచనున్నారు. అత్యధికంగా వాంకిడి నర్సరీలో 30 వేల మొక్కలు, ఖమాన నర్సరీలో 20 వేల మొక్కలు పెంచనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా నర్సరీల నిర్వహణకు మొక్కల సామర్థ్యాన్ని బట్టి నిధులు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం నర్సరీల్లో విత్తన సేకరణ జరగగా ఎరువులతో కూడిన సారవంతమైన మట్టితో బ్యాగులు నింపి విత్తనాలు నాటేందుకు బెడ్లుగా ఏర్పాటు చేస్తున్నారు. కాగా ఈ నర్సరీల్లో నిమ్మ, జామ, దానిమ్మ, చింత, టేకు, సీతాఫలం, పూల మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

ఉపాధి కూలీలకు జీవనోపాధి..

ఆయా మండలాల్లోని గ్రామాల్లో జనాభా ప్రతిపాదికన మొక్కలు పెంచనున్నారు. ఒక్కో నర్సరీతో 200 నుంచి 300 ఉపాధి దినాలు లభిస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. మట్టి, ఎరువులు జల్లెడ పట్టడం నుంచి బ్యాగ్ ఫిల్లింగ్, మొక్కల పెంపకం, లిఫ్టింగ్, కలుపుతీత వంటి పనులతో 10 నుంచి 15 మంది ఉపాధి కూలీలకు జీవనోపాధి లభించనుంది. మొక్కలకు నీళ్లు పట్టడం, రక్షణ చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకించి వనసేవకుడిని నియమిస్తారు. నర్సరీల్లో పనిచేసే కూలీలకు మస్టర్ పేమేంట్ ద్వారా రోజుకు రూ.272 చెల్లిస్తారు. దీంతో ప్రతీ గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీలకు జీవనోపాధి లభించనుంది.

పకడ్బందీగా నిర్వహణ

మండలంలో నర్సరీల నిర్వహణ పకడ్బందీగా కొనసాగుతుంది. 28 నర్సరీల్లో నిర్దేశించిన మొక్కలను పెంచేందుకు పనులు ప్రారంభమయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొత్తం 3.5 లక్షల మొక్కలు పెంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్, బెడ్ల ఏర్పాట్ల పనులు కొనసాగుతున్నాయి.

- శ్రావణ్ కుమార్, ఏపీవో, వాంకిడి

అవగాహన కల్పిస్తున్నాం

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో హరితహారం నర్సరీల్లో పనులు కొనసాగుతున్నాయి. నర్సరీల నిర్వాహకులకు ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శుల సహాయంలో అవగాహన కల్పిస్తున్నాం. నర్సరీలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఒక్కో కూలీకి రోజుకు రూ.260 వరకు లభిస్తుంది.

- మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో, కెరమెరి

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



కౌటాల: మాట్లాడుతున్న రావి శ్రీనివాస్

కౌటాల: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలపై ప్రజలకు కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. నాయకులు సత్యనారాయణ, సంతోష్, శ్రీనివాస్, రాంకుమార్, దేవయ్య, వసంత్, మధుకర్ పాల్గొన్నారు.

బెజ్జూర్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండలంలోని మర్తిడి గ్రామంలో కార్యకర్తలతో సమావేశాలను నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు హకీమ్, రాజారాం, రషీద్, బాబాజీ, విష్ణుమూర్తి, గోపాల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్

రెబ్బెన: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు పెంచాలని లేని పక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. గురువారం గోలేటి ఎక్స్‌రోడ్‌వద్ద యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం కోల్ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమదోపిడికి గురి చేస్తోందన్నారు. ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షుడు లచ్చన్న, రవిప్రసాద్, కార్యదర్శులు బుచ్చన్న, కృష్ణ సంయుక్త కార్యదర్శులు సాగర్, కోశాధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్ వేతనాలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న ఓదెలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో పని చేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్స్‌లకు వెంటనే వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు (సీఐటీయూ) అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. గురువారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం వద్ద ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ పూట ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. యాజమాన్యం చర్యలు తీసుకోవాలని, కాంట్రాక్టర్ అడ్వాన్స్ రూపంలో కొంత మొత్తాన్ని సెక్యూరిటీగార్డులకు అందించే ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు.

కైరిగూడ కార్మికులకు ప్రమోషన్ పత్రాల అందజేత



పత్రాలు అందజేస్తున్న మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో గురువారం కార్మికులకు ఎస్ఎల్‌పీ ప్రమోషన్ పత్రాలను ఓసీపీ మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్ కార్మికులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ఒక కేటగిరిలో 8 సంవత్సరాల పాటు పని చేసిన వారికి ఎస్ఎల్‌పీ పదోన్నతులు లభించాయన్నారు. ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఓసీపీ ఇన్‌చార్జి రెహమాన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిరణ్‌బాబు, దివాకర్, ఏ రిలే షిఫ్ట్ ఇన్‌చార్జి రాజయ్య, నాయకులు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల రామకృష్ణ వివేకానంద సెంటర్‌లో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సిర్పూర్ ఎమ్మెల్యే, ప్రజా బంధు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్త్రీ వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ సర్జన్, ఎముకల వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

వాంకిడి: మండల కేంద్రంలోని కేజీబీవీలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరం కొనసాగుతుంది. గురువారం మండల వైద్యాధికారి ఉప్రె వినయ్ కుమార్ పర్యవేక్షణలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెచ్ఈవో రవిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న సోమశేఖర్

రెబ్బెన: వచ్చే నెలలో సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో పంచాయతీల ఎన్నికలు నిర్వహించే వరకు ప్రస్తుతం ఉన్న సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించాలని సౌత్ ఇండియా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు చెన్న సోమశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం రాత్రి జైనూర్‌లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2019 జనవరిలో సర్పంచుల ఎన్నికల జరిగినప్పటికీ 2019 నవంబర్ వరకు ప్రభుత్వం సర్పంచులకు బాధ్యతలు, చెక్ పవర్ అందించలేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉద్యోగుల కంటే సర్పంచులకే ఎక్కువ పనిభారం ఉందన్నారు. సకాలంలో బిల్లులు రాక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. కరోనా నేపథ్యంలో 18 నెలల పాటు ఎలాంటి నిధులు విడుదల కాలేదని పేర్కొన్నారు. గతంలోనూ ఉమ్మడి రాష్ట్రంలో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా సర్పంచులను పర్సన్ ఇన్‌చార్జీలుగా కొనసాగించిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ సర్పంచ్ శ్యాంరావ్, బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మధునయ్య, బొమ్మినేని శ్రీధర్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



రెబ్బెన: లేతన్‌గూడ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

రెబ్బెన: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గురువారం మండలంలోని లేతన్‌గూడ పాఠశాలలో, సంతూర్ ఆధ్వర్యంలో గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు రంగురంగులతో అందమైన ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. గోలేటిలో నిర్వహించిన ముగ్గుల పోటీల కార్యక్రమానికి రెబ్బెన సీఐ అల్లం నరేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లేతన్‌గూడ పాఠశాల హెచ్‌ఎం రవికుమార్, సింగరేణి పాఠశాల ఉపాధ్యాయులు ఆర్లారెడ్డి, పీఈటీ భాస్కర్ పాల్గొన్నారు.

బెజ్జూర్: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన జావిద్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 50 మంది విద్యార్థులు పాల్గొని వేసిన రంగురంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రతిభ కనబర్చిన పోసాల అక్షితకు ప్రథమ, ఆదే మానసకు ద్వితీయ, నికాడి శ్రీజకు తృతీయ బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనాథ్, రవికుమార్, శ్రీనివాస్, జమీల్, యాఖుబ్, ఆశజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.



బెజ్జూర్: ముగ్గులు పరిశీలిస్తున్న ఎంపీటీసీ



రెబ్బెన: సింగరేణి పాఠశాలలో..

గోయగాం పాఠశాలలో..

కెరమెరి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ తరగతులకు చెందిన విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, విజేశ్, గణేశ్, ప్రవీణ్, మురళి, విజయ తదితరులు ఉన్నారు.



కెరమెరి: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



కౌటాల: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ఇన్‌ఫంట్ జీసస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకొని పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ టామో తెలిపారు.

అంబరాన్నంటిన 'సంక్రాంతి' సంబరాలు

రెబ్బెన: మండలంలోని పులికుంట కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించటంతో గురువారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పండుగ సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు చీరకట్టు, పంచెకట్టుతో ఆకట్టుకున్నారు. బోగి మంటలు వేయటంతో పాటు, పొంగల్ తయారు చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.



హరిదాసు వేషధారణలో విద్యార్థి

'భీమయ్య' దేవునికి ఆదివాసీల పూజలు



కెరమెరి: మండలంలోని కల్లెగాం(కొత్తగూడ) గ్రామంలో గురువారం తోప్‌బలి భీమయ్య దేవునికి ఆదిమ గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం అర్ధరాత్రి ప్రారంభమైన పూజలు గురువారం ముగిశాయి. వివిధ గ్రామాలకు చెందిన ఆదిమ గిరిజనులు తరలివచ్చి ఆలయంలోని దేవతా ప్రతిమలకు పూజలు చేశారు. జెండాలకు మొక్కడంతోఎ పాటు సాంప్రదాయ నృత్యాలు చేశారు. కటోడా భీంరావు, దేవు, అన్నిగ భీంరావు ఉన్నారు.

చట్టి జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నాయకులు

కెరమెరి: మండలంలోని చిన్న పాట్నాపూర్ గ్రామంలో ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న ఓంరాజ్ వంగెపురి భీమయ్యక్ స్వామి వారి చట్టి జాతర మహోత్సవ పోస్టర్లను గురువారం ఎంపీపీ పెందోర్ మోతిరాం, తహసీల్దార్ షరీఫ్, డీటీ సంతోష్ విడుదల చేశారు. ఈ జాతర మూడు రోజుల పాటు కొనసాగనుందని భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ న్యానేశ్వర్, ఆత్రం ధర్మూ, పెద్ద భీము, సిడాం భీము, సోనేరావు, రాజు, జంగు, రఘునాథ్, బొజ్జిరావు, దండు, జగన్నాథ్‌రావు, ధర్మూ, శ్రీనివాస్ ఉన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర



కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కెరమెరి: మండలంలోని గోయగాం గ్రామంలో గురువారం భక్తులు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనేక మంది భక్తులు తరలివచ్చి ర్యాలీలో పాల్గొని శ్రీ రాముని నామస్మరణ చేశారు. ఆదే పాండురంగ్, సోనాజీ, లక్ష్మణ్, బాపూజీ, దిలీప్ తదితరులు ఉన్నారు.